క్లుప్తంగా

ఏఎంసీ డైరెక్టర్‌గా దత్తు రావు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): తనపై ఉన్న నమ్మకంతో సదాశివనగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవిని ఇచ్చినందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు భూంపల్లి గ్రామానికి చెందిన కరట్లపల్లి దత్తురావు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దత్తురావు మాట్లాడుతూ... ఇచ్చిన పదవికి తగిన న్యాయం చేస్తానన్నారు. అలాగే సీనియర్ మండల కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాజాగౌడ్



రాజంపేట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి కుటుంబం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైద్రాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాలు, కళాశాలకు చెందిన పలువురు ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజంపేట మండల కేంద్రానికి చెందిన బస్వాపురం రాజాగౌడ్‌ను ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక చేసి సన్మానించారు. ప్రొఫెసర్లు శ్రీనివాస్ రావ్, కుసుమా రెడ్డి పాల్గొన్నారు.

అనాథ మహిళకు టార్పాలిన్ల అందజేత

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన అనాథ మహిళకు వ్యాపారి పురాం రాజమౌళి తాటిపత్రిలను ఆదివారం అందజేశారు. సుమారు రూ.10 వేల విలువ చేసే టార్పాలిన్లను అందజేయడంతో పాటు వాటిని ఆమె ఇంటిపై కప్పేందుకు అయ్యే కూలి డబ్బులు రూ.5 వేలను కూడా అందజేశారు.

నిరుపేదకు ఆర్థిక సాయం

భిక్కనూరు: మండల కేంద్రంలోని పాత దళితవాడలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలి నిరాశ్రయురాలైన గోసు లక్ష్మికి భారతి సేవ సంస్థ ఆధ్వర్యంలో రూ.5 వేల సాయం అందజేశారు. భారతి సేవ సంస్థ ఫౌండర్ లింగాల రాజబాబుగౌడ్, నేతలు ద్యాగల కిరన్,గోసు బాల్‌రాజు,తదితరులు పాల్గొన్నారు.

వారణాసిలో కాశీ క్షేత్రం ఏర్పాటు

బాన్సువాడ: వారణాసిలో కాశీ క్షేత్రం ఏర్పాటు చేయనున్నట్లు సుదర్శన దండి స్వామిజీ తెలిపారు. ఆయన కాశీ నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి కాశీకి వచ్చే భక్తుల సౌకర్యం కోసం వారణాసిలో కాశీ క్షేత్రం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కాశీకి వచ్చే భక్తులు 96666 09309 ఫోన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పీసీసీ పదవి రావడం గర్వకారణం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కు పీసీసీ పదవి రావడం గౌడ కులస్తులకు గర్వ కారణమని నస్రుల్లాబాద్ మండల గౌడ కులస్తులు అన్నారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం టపాకాయలు కాల్చారు. గౌడ సంఘం సభ్యులు కూని సాయాగౌడ్, డి.మైశాగౌడ్, ఇ.సాయాగౌడ్, రామాగౌడ్, యాదగిరి గౌడ్, సాయాగౌడ్, రమేష్ గౌడ్ ఉన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

బాన్సువాడ రూరల్: అంబేడ్కర్, జ్యోతీబా పూలే లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని, వారి నుంచి స్ఫూర్తి పొందాలని ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ అన్నారు. ఆదివారం ఆయన బోర్లం గ్రామంలో ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకునరి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక దశ నుంచే చక్కగా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. హాస్టల్ వార్డెన్ లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ భవనంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. లయన్స్ ప్రతినిధులు రాజ్‌కుమార్, శ్యాంగోపాల్, పున్నరాజేశ్వర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



బీబీపేటలో గణపతిని భాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకొస్తున్న అంబేద్కర్ సంఘం సభ్యులు



బాన్సువాడలో శోభాయాత్రగా వెళ్తున్న వినాయక విగ్రహాలు



గోపాల్‌పేటలో ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు



నస్రుల్లాబాద్‌లో కొలువుదీరిన యువ భారత్ గణేష్ మండలి గణనాథుడు

కొలువుతీరిన గణనాథులు



సదాశివనగర్‌లో..

వినాయక చవితిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శనివారం మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. ఈ సందర్భంగా మండపాలను అందంగా అలంకరించి అందులో బొజ్జ గణపయ్యను ప్రతిష్ఠించిన తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు వినాయక విగ్రహాలను ఊరేగింపుగా మండపాలకు తీసుకొచ్చారు. పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా మార్కెట్లు సందడిగా మారాయి.

– సాక్షి నెట్‌వర్క్



బాన్సువాడ: అయ్యప్ప ఆలయం వద్ద మట్టి గణపతుల కోసం పెద్ద ఎత్తున క్యూ కట్టిన భక్తులు



రాజంపేట: వెండి వినాయకుడితో హిందూ దళ్ యూత్ సభ్యులు



దేవునిపల్లిలో నెహ్రూయూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ..



దోమకొండ పోలీస్‌స్టేషన్‌లో పూజలు చేస్తున్న ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది



భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో ..



పెద్దమల్లారెడ్డిలో కాగితంతో గణపతిని తయారు చేసిన పరశురామ్‌గౌడ్‌కు సన్మానం



ఎల్లారెడ్డిలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పూజలు



తాడ్వాయిలో వార్‌గాయ్స్ ఆధ్వర్యంలో గణనాథుడు



లింగంపేటలో వినాయకునికి పూజలు



బీర్కూర్‌లో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు



పిట్లంలో.. కొంతం రాజ్‌కుమార్



బస్వాపూర్‌లో ..



దోమకొండలో గణేశ్ పూజల సందర్భంగా తీసిన డ్రాలో విజేతకు వెండి విగ్రహాన్ని అందజేస్తున్న నిర్వాహకులు



బాన్సువాడలో పూజ చేస్తున్న సీఐ కృష్ణ



కామారెడ్డి ఎమ్మెల్యే పంపిన లడ్డూను తలమడ్లలో నిర్వాహకులకు అందజేస్తున్న బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డిరూరల్: గణపతి పూజ కోసం సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

కుంగిన లింగంపల్లికలాన్ రోడ్డు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బంజర నుంచి లింగంపల్లి కలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో కుంగిపోయింది. రోడ్డు పక్కనే ఉన్న పోచారం ప్రధాన కాలువ కింద నుంచి అండర్ టన్నెల్(నాలా మోరీ) ఉంది. అటవీ ప్రాంతంలో కురిసిన వర్షపునీరు పోచారం ప్రధానకాలువ కింద నున్న ఈ అండర్ టన్నెల్ ద్వారా పంట పొలాల్లోకి చేరుతుంది. కాగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అండర్ టన్నెల్ ఒకవైపు కుంగిపోయి రోడ్డుకు రంధ్రం పడింది. దీంతో ఈ రోడ్డుపై బైక్‌లు మాత్రమే వెళ్లే అవకాశం ఉంది. ఇరిగేషన్ సిబ్బంది రోడ్డు కుంగిన ప్రాంతానికి చేరుకొని బుంగను పరిశీలించారు. గ్రామస్తుల సహకారంతో గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంచెలను వేయించారు. ముళ్లకంపలను అడ్డుగా వేశారు.



కుంగిన రోడ్డును గ్రామస్తులతో కలిసి పరిశీలిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

లక్కీడ్రాలో రూ.7,777 నగదు బహుమతి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ గణేష్ మండలికి లక్కీడ్రాలో రూ.7,777 నగదు బహుమతి వచ్చినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా ఆదివారం తెలిపారు. అమ్మ-నాన్నల జ్ఞాపకార్థం మండలంలోని 135 గణేష్ మండపాలకు నిర్వహించిన డ్రాలో మాచాపూర్ గణేష్ మండలికి ద్వితీయ బహుమతిగా రూ.5,555, ఎల్లారెడ్డి పట్టణానికి తృతీయ బహుమతిగా రూ.1,111 వచ్చినట్లు తెలిపారు. నాయకులు వెంకట్రాంరెడ్డి, ఉషాగౌడ్, గోపి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్ల విలువైన వీడీసీ స్థలం కబ్జాకు యత్నం

భిక్కనూరు: మండల కేంద్రంలో రూ.3 కోట్ల విలువ చేసే గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ)కి చెందిన స్థలాన్ని కొందరూ కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అఖిలపక్షనేతలు ఆరోపించారు. ఆదివారం అఖిలపక్ష నేతలు మాజీ సర్పంచ్‌లు తున్కి వేణు, నర్సింహారెడ్డి, నాయకులు లింబాద్రి, మైపాల్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి,నర్మల రాంచంద్రం, తదితరులు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో అతిథి గృహం లేనందున అప్పటి వీడీసీ అధ్యక్షుడు శనిశెట్టి వెంకటేశం ఆధ్వర్యంలో 10 గుంటల స్థలాన్ని చర్చి సమీపంలో కొనుగోలు చేశారన్నారు. కొన్ని కారణాల వల్ల అతిథి గృహం నిర్మించలేదని, ఆ స్థలం పక్కన ఉన్నవారు ఈ స్థలంపై కన్నేసి కబ్జాకు రూపకల్పన చేశారన్నారు. ఇటీవల ఓ వ్యాపారితో పాటు కొందరు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు భూమిని చదును చేసి కడీలు పాతారన్నారు. కబ్జాదారులు వెళ్లిపోవాలని లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు.



భిక్కనూరులో మాట్లాడుతున్న అఖిలపక్ష నేతలు

అక్షరాస్యతతోనే వేగవంతంగా అభివృద్ధి

భిక్కనూరు: సంపూర్ణ అక్షరాస్యతతోనే వేగవంతంగా దేశం అభివృద్ధి చెందుతుందని భారతి సేవ సంస్థ ఫౌండర్, న్యాయవాది లింగాల రాజబాబుగౌడ్ అన్నారు. ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంలో అంతర్జాతీయ సంపూర్ణ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా భిక్కనూరు పట్టణానికి చెందిన 18 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గజ్జెల భిక్షపతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేష్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఘనంగా సుదర్శన నారసింహ హోమం



మాచారెడ్డి: చుక్కాపూర్ శ్రీ లక్ష్మి నర్సింహస్వామి దేవాలయంలో సుదర్శన నారసింహ హోమం ఆదివారం నిర్వహించారు. పాడి పంటలు బాగా పండాలని, సుఖశాంతులతో ప్రజలు ఉండాలని ఆలయ అర్చకులు పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ పాల్గొన్నారు.

భారీ వర్షానికి కూలిన చెట్లు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురియడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షంతో వీధులు జలమయమయ్యాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలుల ధాటికి మాలోత్ సంగ్యానాయక్ తండాలో రెడ్యానాయక్ ఇంటిపై భారీ చెట్టు కూలి ఇల్లు ధ్వంసమైంది. అలాగే విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుపై పడిపోయింది. దాంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాన్స్ కో అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



మాలోత్ తండాలో కూలిన భారీ వృక్షం

ఆవుల తరలింపు అడ్డగింత

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ఆదివారం ఓ వ్యక్తి తన సొంత ఆవులను వేరే వ్యక్తికి విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తి ఆవులను తీసుకెళ్తుండగా గమనించిన స్థానికులు అడ్డుకున్నారు. సొంత ఆవులైనా సరే దళారులకు అమ్మవద్దని పట్టుబట్టారు. గోమాతను అమ్ముకుంటే భవిష్యత్‌లో పశ్చాత్తాపడాల్సి వస్తుందని అన్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి ఆవులను అమ్మిన వ్యక్తి ఇంటికే పంపించారు. పోలీసులు వచ్చి అందరిని అక్కడి నుంచి పంపించివేశారు.



బీర్కూర్‌లో అడ్డుకుంటున్న స్థానికులు

సమాచారం..

నేడు తాడ్వాయిలో ప్రజావాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని 2వ వార్డులో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో మురికి కాలువల నిర్మాణ సమయంలో కాలనీలోని మురికి కాలువలను తొలగించడంతో విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారిందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు.

ఎల్లారెడ్డి పట్టణంలోని 2వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం →



ఇళ్ల మధ్య మురికి గుంత.. తీరేనా చింత ?



రామారెడ్డి: ఇళ్ల పక్కనే పెద్ద గుంతలో మురికి నీళ్లు నిల్వ ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామంలోని పదో వార్డులో కొన్నేళ్ల క్రితం మొరం కోసం పెద్ద గుంత తీశారు. ఆ గుంత ఉన్న ఏరియాలో ఆనుకొని దాదాపుగా 20 వరకు ఇల్లు ఉన్నాయి. మొరం కోసం తీసిన గుంతలో నీళ్లు చేరుతున్నాయి. వర్షాలు పడితే గుంతలోని నీళ్లు ఇళ్లలోకి చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్యంతో బీజేపీ జిల్లా నేత మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బొల్లారం సాయన్న (62) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గత 30 ఏళ్లుగా మండల, జిల్లా స్థాయిలో బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. కొంత కాలంగా జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు నిజామాబాదులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఆయన మృతి పట్ల మండల, జిల్లాకు చెందిన ఆయా పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. బీజేపీకి ఆయన మృతి తీరని లోటని అన్నారు.

పద్మశాలి సంఘం మండల కార్యవర్గం

బీబీపేట: భక్త మార్కండేయ పద్మశాలి సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుమ్మ రాజేందర్, ఉపాధ్యక్షుడిగా దుడుగు రమేష్, ప్రధాన కార్యదర్శిగా చందుపట్ల పురుషోత్తం, కోశాధికారిగా గడ్డం నరేష్, కార్యదర్శిగా తుమ్మ మహేందర్, సలహాదారులుగా చందుపట్ల శ్రీహరి, బత్తిని జనార్దన్, సిరిగాద నాగరాజు, బోడ ఆనందం, కార్యవర్గ సభ్యులు చందుపట్ల సందీప్, చింతకింది వేణు, తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా పద్మశాలి సంఘం డివిజన్ అధ్యక్షులు తుమ్మ మచ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడిగా సాయిబాబా

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి డివిజన్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా మర్లు సాయిబాబాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు బిట్ల సురేందర్ ఆదివారం తెలిపారు. ఎల్లారెడ్డి డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులుగా రాజు, దత్తు, సాయిలు, ప్రధాన కార్యదర్శిగా జీవన్, కోశాధికారిగా రొడ్డ సాయిబాబాలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.